క్లుప్తంగా

తాగునీటి సమస్యపై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ కార్యాలయంలో వేసవి కాలం దృష్ట్యా నీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం, త్వరగా నీటి సరఫరా యాథావిధిగా పునరుద్ధరించుటకు నిరంతర పర్యవేక్షణ కోసం హెల్ప్‌డెస్క్ (సెల్ నంబర్ 98494 20800)ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ టి.రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

మహబూబాబాద్: ప్రత్యేక పరిస్థితులు కలిగిన ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణి ఉపాధ్యాయినీలను, బాలింతలను, అంగవైకల్యం, చూపులోపించిన వారికి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, హలియా నాయక్, రాంజీ పాల్గొన్నారు.

బీరువా బహూకరణ



మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు క్రమశిక్షణతో పలువురి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని శనిగపురం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం శ్రీధర్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు మంగళవారం పాఠశాలకు బీరువాను బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంజాన్ అలీ, వీరస్వామి, జోస్ఫిన్, కవిత, ప్రభాకర్, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నెల్లికుదురు: రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో వడదెబ్బ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లపై ఉందని ఎంపీడీఓ బాలరాజు, ఎస్సై కె.క్రాంతికిరణ్, డిప్యూటీ తహసీల్దార్ తరంగిణి సూచించారు. పీహెచ్‌సీలో కలెక్టర్, వైద్యశాఖ ఆదేశాలతో ఏఎస్‌ఎంలకు మండల వైద్యాధికారి వంశీకృష్ణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వడగాలులు, వడదెబ్బ, హెల్త్ ఎడ్యుకేషన్ లక్షణాలు, ప్రథమ చికిత్స తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అపాయింట్‌మెంట్ నుంచి రిటైర్మెంట్ వరకు..

ఒకే చోట విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడు



డోర్నకల్: ఓ ఉపాధ్యాయుడు ఉద్యోగంలో చేరిన పాఠశాలలోనే పదవీ విరమణ పొందనున్నాడు. పరకాల శివారు గ్రామానికి చెందిన తాళ్లపల్లి రమేష్ తన 46 సంవత్సరాల వయసులో ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికై 2010 నవంబర్ 6న మండలంలోని హూన్యాతండా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. 2025 అక్టోబర్‌లో పదవీ విరమణ పొందనున్నాడు. కేవలం 15 సంవత్సరాలే వృత్తిలో కొనసాగుతుండగా ఉద్యోగంలో చేరిన రోజు నుంచి 8 ఏళ్లుగా ప్రభుత్వం బదిలీలు చేపట్టకపోవడంతో హూన్యాతండా పాఠశాలలోనే విధులు నిర్వహిస్తున్నాడు.

చలివేంద్రం ప్రారంభం

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి పక్కన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి సుమంత్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, కారోబార్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

దంతాలపల్లి: మండలంలోని గున్నెపల్లి చివారు పొంద్యా తండాలో సోదాలు నిర్వహిస్తున్న క్రమంలో తండాకు చెందిన గుగులోత్ రవి ఇంట్లో 10 లీటర్ల గుడుంబా దొరికింది. గుడుంబా స్వాధీనం చేసుకొని రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపాడు.

కేసు నమోదు

గార్ల: మండలంలోని సేరిపురం గ్రామానికి చెందిన గూగులోత్ సుక్కి అక్రమంగా గుడుంబా విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకొని ఆమె నుంచి 6లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. సుక్కిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ మంగళవారం తెలిపారు.

బహుజన వీరుడు సర్వాయి పాపన్న



మహబూబాబాద్ అర్బన్: పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నెహ్రూసెంటర్: నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



తొర్రూరు: నివాళులర్పిస్తున్న నాయకులు



మరిపెడ: నివాళులర్పిస్తున్న గంగాధర్, రజనీకాంత్

మహబూబాబాద్ అర్బన్: రాచరికపు వ్యవస్థ నీడలో జమీందార్లు, జాగీర్దార్ల అరాచకాలను సహించలేక కడుపుమండి కత్తి పట్టి పోరాటం చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పైండ్ల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం పాపన్న వర్ధంతి వేడుకలకు నిర్వహించారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రఘునాథపల్లి మండల ఖిలాషాపూర్‌ను కేంద్రంగా చేసుకొని మొగల్స్ ఆధిపత్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశాడన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ వేముల కొమ్మారెడ్డి, నాయకులు రాజారాం, భార్గవ చారి, వల్లాల ఉప్పలయ్య, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని పార్లమెంట్, అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని గౌడ జనహక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జిల్లా అధ్యక్షులు ముంజాల రాజేందర్‌గౌడ్ అన్నారు. పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు భద్రసేనాగౌడ్, సమ్మయ్యగౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్నగౌడ్, గౌడ జేఏసీ కన్వీనర్ సమ్మెట వెంకన్నగౌడ్, లింగాల వీరభద్రం గౌడ్, మద్దెల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్టోజు గంగాధర్, ఓబీసీ మండల అధ్యక్షుడు సొంటి రజనీకాంత్ ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తొర్రూరు: గోల్కొండ కోటపై బహుజనుల జెండాను ఎగిరేసిన సర్వాయి పాపన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, నాయకులు పెదగాని సోమయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై సునంద

మహబూబాబాద్ అర్బన్: మీ రక్షణ.. మా బాధ్యత అని షీటీం ఎస్సై సునంద అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం సాంఘిక సంక్షేమ బీఫార్మసీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు షీటీంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై సునంద మాట్లాడుతూ.. కళాశాలలో కానీ, బయట ఎక్కడైన ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురి చేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100, 181కు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవన్నారు. షీ టీం నంబర్ 87126 56935, 79011 42009 తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న, ఎస్సై ఆనందం, సిబ్బంది అరుణ, ఊర్మిళ, శారద, అధ్యాపకురాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు వైద్యం అందేలా చూడాలి



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నెహ్రూసెంటర్: జాతీయ వైద్యారోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. అర్బన్ పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జాతీయ కార్యక్రమాల టార్గెట్‌లు పూర్తి చేయాలని, గర్భిణులను మూడు నెలలలోపు రిజిస్ట్రేషన్ చేయించాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి వైద్య అందేలా చూడాలన్నారు. హీట్‌వేవ్‌కు ఎవరు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ అందుబాటులో ఉన్నాయని వాటన్నింటిని పంపిణీ చేయాలని సూచించారు. గర్భిణులకు, నవజాత శిశువులకు టీకాలు తప్పనిసరిగా తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్‌నర్స్ వసంతరాణి, హెచ్ఈఓ రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్స్ రత్నకుమారి, పుష్పలీల, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రమ్య, డాక్టర్ నర్మద, ఎంఎల్‌హెచ్‌పీలు నితిన్, దీపిక పాల్గొన్నారు.

ఉనికి కోసమే ప్రజల్లోకి కేసీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

డోర్నకల్: బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోయే ప్రమాదం ఉండటంతో కేసీఆర్ ప్రజల్లోకి వచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. డోర్నకల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎక్కువ ధరలకు విద్యుత్‌ను కొనుగోలు, ఇరిగేషన్ శాఖలో అవినీతి తదితర కారణాలతో రాష్ట్రం లక్షలాది రూపాయల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ముందుగానే గమనించిన కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా కరువు పరిస్థితులు నెలకొనేలా చేశారని ఆరోపించారు. ఆర్థిక విధ్వంసం సృష్టించిన కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులతోపాటు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో నాలుగు నెలల తరువాత ప్రజల్లోకి వచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని తెలిపారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు సుమేర్‌చంద్‌జైన్ సతీమణి జ్యోతిజైన్ ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకోగా ఎమ్మెల్యే ఆమెను పరామర్శించారు. ఈ సమావేశంలో నాయకులు సమేర్‌చంద్‌జైన్, శ్రీనివాస్, శంకర్, వెంకటేశ్వర్లు, భాస్కర్, రామకోటి, సుశీల్‌కుమార్‌జైన్ పాల్గొన్నారు.

మామిడికాయలకు బ్యాగ్స్ తొడుగు విధానంపై అవగాహన

దంతాలపల్లి: మామిడి తోట రైతులు ఈ సీజన్‌లో మామిడి కాయలకు బ్యాగ్స్ తొడగడం ద్వారా పంటలో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మరియన్న అన్నారు. మండలంలోని బొడ్లాడ గ్రామంలో మంగళవారం రైతు జనిగల అశోక్ తోటలో బ్యాగ్స్ తొడిగే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తొర్రూరు డివిజన్ ఉద్యానశాఖ అధికారి రాకేష్, బిందు సేద్య ప్రతినిధులు ప్రసాద్‌బాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

నెల్లికుదురు: గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం మండల నాయకుడు ఇస్సంపల్లి సైదులు కోరారు. ఈమేరకు గ్రామ మహిళలతో కలిసి మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తిగా ఎండాకాలం సమీపించక ముందే మండలంలో మునిగలవీడు గ్రామంలో తాగునీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యాకూబ్, కమలమ్మ, నీలమ్మ, రాములమ్మ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు సామగ్రి అందజేత



సరుకులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ శివారు చైతన్యనగర్ కాలనీలో అనాథలైన దేవేందర్, అమర్, అఖిల ఉండటానికి ఇల్లు లేకపోవడంతో తల్లి అంత్యక్రియల కోసం వేసిన టెంటు కిందే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఈమేరకు సాక్షి దినపత్రికలో 'ఆ పిల్లలకు టెంటే..ఇళ్లయింది' అనే శీర్షిక ప్రచురితమైంది. ఈమేరకు స్పందించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గురు పిల్లలకు తాత్కాలిక వసతి కోసం టార్పాలిన్, 3దుప్పట్లు, దోమ తెరలు, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ వరప్రసాద్, కోశాధికారి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల రవిచందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు గొర్రె వెంకన్న, సాయి, మాసాడి శ్రీను, చిట్ల సంపత్, రవి, కొమ్ము రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీగా మురళీకృష్ణను గెలిపించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

బయ్యారం: మహబూబాబాద్ పార్లమెంటు స్థానంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని పార్టీ కేంద్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. బీజేపీ సర్కారు సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని రాజకీయ పార్టీలను, ప్రతిపక్షాలను అణచివేస్తున్నాయని తెలిపారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జడ సత్యనారాయణ, శివారపు శ్రీధర్, ఇడంపాక శ్రీశైలం, గౌని ఐలయ్య, అభ్యర్థి మురళీకృష్ణ, ఊకే పద్మ, ఆగబోయిన నర్సక్క, సనప పొమ్మయ్య, మాధంశెట్టి నాగేశ్వరరావు, వీరభద్రం, రాకేష్, వీరభద్రం, భిక్షం, చైతన్య, మధు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

కేసముద్రం: ప్రతీ ఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీస్ కళాజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసై, తమ బంగారు భవిష్యత్‌ను ఆగం చేసుకోవద్దన్నారు. మూఢనమ్మకాలను ప్రజలు విడనాడాలన్నారు. గుడుంబా తయారీ, బెల్లం, గంజాయి రవాణాకు, ఎవరైన పాల్పడితే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై వంశీధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసపత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

కురవి: ముంబై సంస్థ ఆధ్వర్యంలో 'రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ఆర్గనైజేషన్ ఫర్ ఇంటర్నేషనల్ లెవల్ ఆర్ట్ కాంపిటీషన్'లో కలరింగ్, కార్టూనింగ్‌లో మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. డి.రాజేశ్వరీ తృతీయ బహుమతి సాధించగా, 8మంది విద్యార్థులు నవదీప్, అఖిల, లోకేష్‌నాయక్, కీర్తన, రేవంత్, తిరణ్‌తాజ్, చరణ్, యశ్వంత్‌లు కన్సోలేషన్ బహుమతులు సాధించారు. మంగళవారం విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు దామోదర్, బిక్కుచౌహన్, సురేష్, లింగమూర్తి, రవికుమార్, రాజేశ్వరీ, వీరభద్రం, సునీల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గృహహింస కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన మహేశ్వరికి కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నాదెళ్ల నవజీవన్ కుమార్‌తో రెండేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కాగా కొద్ది నెలల నుంచి మహేశ్వరిని అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అతని తల్లి ప్రభావతి, సోదరి జ్యోతి, బావ వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంట్లో చోరీ..

నగదు, ఆభరణాల అపహరణ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని రామచంద్రాపురం కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగి అర తులం బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.33వేల నగదు అపహరణకు గురయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం కాలనీలో నివాసం ఉండే కందాటి చంద్రశేకర్ తమ స్వస్థలమైన మండలంలోని కంబాలపల్లి గ్రామానికి ఆదివారం వెళ్లాడు. మంగళవారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి, చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఫింగర్ ప్రింట్స్ బృందం సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సర్వీస్ వైరు..

గార్ల: గార్లలోని రక్షిత మంచినీటి పథకం మోటార్‌కు అమర్చిన రూ.28వేల విలువ గల సర్వీస్ వైరును సోమవారం రాత్రి చోరీకి గురైనట్లు పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి తెలిపాడు. ఈమేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. పోలీసులు నిఘా పెంచి చోరీలను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గుండెపోటుతో టీఏ మృతి

కొత్తగూడ: ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నాగార్జున(35) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. నర్సంపేట పట్టణానికి చెందిన నాగార్జున సుమారు 9సంవత్సరాలుగా మండలంలో టీఏగా పని చేస్తున్నాడు. హఠాత్తుగా కుప్పకూలిపోయిన నాగార్జునను వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు

ఉపాధి కూలీ..

నర్సింహులపేట: మండల కేంద్రానికి చెందిన లెక్కల సావిత్రమ్మ(60) మంగళవారం ఉపాధి కూలీ పనులకు వెళ్తూ మృతి చెందింది. సావిత్రమ్మ మార్గమధ్యలో స్పృహతప్పి పడిపోవడంతో తోటి కూలీలు వెంటనే స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబాబాద్‌కు ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వానరం..

కేసముద్రం: మనుషుల్లోనే కాదు..జంతువుల్లో కూడా మాతృప్రేమ ఉంటుందనే సత్యం మండల కేంద్రంలో జరిగిన ఓ సంఘటనతో కనిపించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేసముద్రంస్టేషన్‌లోని అంబేడ్కర్‌సెంటర్ సమీపంలో గల ఓ రైస్‌మిల్లు ముందున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్ తీగలకు వానరం తాకి మృతి చెందింది. తల్లి కోతి పిల్ల కోతి కోసం అక్కడే నిరీక్షిస్తూ ఉండిపోయింది. దాదాపు రెండు గంటల పాటుగా దిగాలుగా కూర్చొని, మృతి చెందిన బిడ్డవైపే చూస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

సంక్షిప్త సమాచారం

చలివేంద్రం ప్రారంభం

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో జీపీ ఆవరణలో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జలధార కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా గాలి ఆశకుమారి జ్ఞాపకార్థంగా దాత భర్తాపురం కొమిరెల్లి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ బీసు పూలమ్మ, ఎంపీటీసీ భర్తాపురం ఉదయమ్మ ప్రారంభించారు.

ఆశ కార్యకర్తల ప్రతిజ్ఞ

కురవి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. మహిళా సాధికారత కేంద్రం మహబూబాబాద్ ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో పథకంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ విరాజిత, పీడీఎంఓ ఝాన్సీ, సంధ్య, మహ్మద్ షఫీ, అరుణ, సంధ్యారాణి పాల్గొన్నారు.

మామిడితోట పరిశీలన

కురవి: మండల కేంద్రంలోని రైతు మామిడి తోటను ఉద్యాన శాఖ అధికారి అనితశ్రీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో 3లక్షల 7వేల ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారని తెలిపారు. మామిడి పూత, కాతలో దిగుబడి తగ్గుతూ వస్తుందన్నారు. చీడపీడలపై అవగాహన కల్పించారు. మామిడి తోటలను జూన్ 15 నుంచి ఆగస్టు 15వరకు కత్తిరింపులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు మేకనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎల్లయ్య

నెహ్రూసెంటర్: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోండ్ర ఎల్లయ్య మంగళవారం కలిశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలని, ఎస్సీ నిరుద్యోగ యువతకు బ్యాంకులతో సంబంధం లేకుండా 50శాతం రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

మరిపెడ రూరల్: ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద టెంటు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని మండలంలోని ఆనెపురం ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మండలంలోని ఆనెపురం గ్రామ ఉపాధి హామీ పని ప్రదేశంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పనుల వద్ద సౌకర్యాలతోపాటు పని ముట్లు కల్పించాలని పలువురు కూలీలు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



తొర్రూరు రూరల్/పెద్దవంగర: బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహేష్‌కుమార్‌గౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో లింగాల వెంకటనారాయణగౌడ్, కేతిరెడ్డి విక్రంరెడ్డి, చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, వల్లపు మల్లయ్య, ఇమ్మడి రమణ, తాళ్లపెల్లి రమేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

గంగారం: గంగారం మండలంలోని బూర్గువారి గుంపు గ్రామంలో ఆదివాసీ చైతన్య, ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం తహసీల్దార్ రాములు, ఎఫ్ఆర్ఓ చలపతి ప్రారంభించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర్క యాదగిరి, న్యూడెమోక్రసీ నాయకులు బూర్క చిన్న వెంకటయ్య, ఎఫ్ఎస్ఓ బాలా, మాజీ ఉపసర్పంచ్ నర్సయ్య, ఎఫ్‌బీఓ సత్యం, మేడ సమ్మయ్య, నారాయణ, రవి పాల్గొన్నారు.

నివాళి

డోర్నకల్: స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన మల్లం రాధిక(70) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మృతిరాలి కుమారుడు మల్లం అనిల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కావడంతో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ రాధిక మృతదేహంపై పూలమాల వేసి అనిల్‌ను ఓదార్చారు. మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, జెడ్పీటీసీ సభ్యులు కమలారామనాథం, ఎంపీపీ బాలునాయక్, రామకృష్ణ, జనార్దన్, వేణుగోపాల్, అశోక్‌కుమార్, యశోధర్ జైన్ నివాళులర్పించారు.

తండాల్లో తాగునీటి ఇక్కట్లు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం గ్రామ పంచాయతీ పరిధిలోని అజ్మీరతండా, కేలోతు తండా, జీన్యతండా, అర్కవత్‌తండా, తారబావోజీతండా తదితర గిరిజన తండాలకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ ప్రధాన పైపు లైన్ ధ్వంసం అయింది. దీంతో వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాక గిరిజనలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ధ్వంసమైన మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని తండా ప్రజలు కోరుతున్నారు.

రేపు ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

గూడూరు: మండలంలోని మధనాపురంలో ఈనెల 4వ తేదీ గురువారం ఉదయం లక్ష్మీగోదా సమేత వేంకటేశ్వరస్వామి నూతన దేవాలయ విమాన గోపుర, ధ్వజ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఆలయ నిర్మాణ దాతలు లింగాల రాధిక సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రణధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మధనాపురం గ్రామంలోని నూతన దేవాలయ ప్రాంగణంలో జరుగుతున్న పూజా మండపం వద్ద ప్రతిష్ఠాపన పూజల వివరాలను తెలియజేశారు. ఉత్సవాలకు మండలంలోని భక్తులు కుటుంబ సమేతంగా హాజరుకావాలన్నారు. అదేవిధంగా ఈ నెల 6 తేదీ ఉదయం శ్రీమాన్ త్రిదండి చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఆశీర్వచనాలు ఉంటాయని తెలిపారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్య తీసుకోవాలి



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన యువకుడు కార్తీక్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్య తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దెప్పెల్లి అనిల్‌మాదిగ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఓసీ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. టెంట్‌హౌజ్‌లో పని చేస్తున్న కార్తీక్‌పై అకారణంగా దాడికి పాల్పడితే వారిపై కేసు నీరుగార్చే సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారని ఆరోపించారు. దాడి చేసిన ప్రతి ఒక్కరిపై కఠిన సెక్షన్లు పెట్టి చర్య తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు పాశం సాంబయ్య, ఎండి.పాష, కందిపాటి భిక్షపతి, మిడతపల్లి యాకయ్య, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక, రజిత పాల్గొన్నారు.